ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
7★★
ఆదివారం 13 ఏప్రిల్ 2025



నేడు ఆర్యవైశ్య మహా సభ సర్వసభ్య సమావేశం

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల ఆర్యవైశ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా ఆర్యవైశ్య కార్యావర్గం, సంఘ సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు. జిల్లా కేంద్రంలోని చల్‌గల్ రైల్వే బ్రిడ్జి సమీపంలో జిల్లా ఆర్యవైశ్య మహా సభ భవన నిర్మాణం కోసం సేకరించిన స్థలంలో సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

జై హనుమాన్

- కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి
- అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు
- ఘనంగా హనుమాన్ చిన్న జయంతి



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్టు

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసిపోయింది. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం కాషాయవర్ణాన్ని పులుముకుంది. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మార్మోగింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి మొదలైన భక్తుల తాకిడి శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హనుమాన్ దీక్షాపరులు మాల విరమణ చేశారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.

- మల్యాల (ఆంధ్రజ్యోతి)

9





మాల విరమణ కోసం బారికేడ్లలో వేచి ఉన్న దీక్షాపరులు



కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాపరులు



తలనీలాలు సమర్పిస్తున్న దీక్షాపరులు



స్నానాలాచరిస్తున్న భక్తులు

లలితాంబికా శక్తి పీఠంలో దివ్య పుష్పయాగం



అమ్మవారికి పుష్పయాగం చేస్తున్న అర్చకులు

రాయికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శ్రీ లలితాంబికా శక్తి పీఠంలో శనివారం శ్రీ రామకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో దివ్య పుష్పయాగం నిర్వహించారు. వేలాది సువాసన గల రంగు రంగుల పుష్పాలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. శ్రీ మహాలక్ష్మి గణపతి, గాయత్రి అమ్మవారికి, శివలింగం, పంచముఖ ఆంజనేయ స్వామి, దక్షిణామూర్తి, దత్తాత్రేయ స్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

యాదవులను చైతన్యపరుస్తాం

యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్

రాయికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పల్లె పల్లెకు వెళ్లి యాదవులను చైతన్యపరుస్తామని, తద్వారా యాదవులకు న్యాయంగా దక్కాల్సిన హక్కులు సాధించుకుంటామని యాదవ సంఘం అడహక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మండలంలోని తాట్లవాయి గ్రామ యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు యాదవనేని రాజలింగం యాదవ్, రెబ్బాసు మల్లయ్య యాదవ్‌లతో కలిసి పాల్గొని సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు కొండవేని గంగాధర్, దడికొప్పుల తిరుపతి,రమేష్ కొండవేని శేఖర్, సత్యం, చిన్న మల్లేష్ యాదవ్, మహేష్, కంది గంగమల్లయ్య, పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్సీ ఎల్ రమణకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్థులు

రాయికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేటలో గల శ్రీరామ ఆలయంలో కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ ఎల్ రమణ, జిల్లా బీజేపీ ఇన్‌చార్జి బోగ శ్రావణిలను కలిసి శనివారం వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించినవారు నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోల రాజు, మాజీ ఎంపీటీసీలు బొమ్మకంటి మురళీధర్, అన్నపురం సత్యం గౌడ్, బెజ్జంకి మోహన్, ఆకుల మహేష్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్వితీయ భాషగా సంస్కృతం యోచనను విరమించుకోవాలి

జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణకు అధ్యాపకుల వినతి

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సంస్కృతంను ద్వితీయ భాషగా ప్రవేశపెట్టాలనే యోచనను విరమించుకోవాలని కోరుతూ జిల్లా ఇంటర్ విద్యాధికారి బొప్పరాతి నారాయణకు పలువురు అధ్యాపకులు వినతిపత్రం అందించారు. శనివారం పట్టణంలోని ఇంటర్ ప్రశ్నాపత్రాల మూల్యాంకన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణను పలువురు తెలుగు అధ్యాపకులు, ఉపాధ్యాయులు కలిసి సమస్యను విన్నవించారు. ఇంటర్‌లో ద్వితీయ భాషగా సంస్కృతంను అమలు చేయడం ద్వారా భవిష్యత్‌లో తెలుగు ఉన్నత విద్యను చదివేవారి సంఖ్య తగ్గి తెలుగు భాష ఉనికికే పెనుప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని విన్నవించారు. కార్యక్రమంలో కళాశాలల తెలుగు అధ్యాపకులు మహేశ్, సంతోష్‌కుమార్, ప్రేమలత, మహేశ్వరి, రామారావు, పద్మ, రాజమౌళి పాల్గొన్నారు.



నారాయణకు వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

కాంగ్రెస్ నేతలకు తప్పని నిరీక్షణ



- నామినేటెడ్ పదవులపైనే ఆశలు
- సర్కారు ఏర్పడిన నాటి నుంచి ఎదురుచూపులు
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి కమిటీల్లో చోటుకు యత్నం
- ఇప్పటికే పలు వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకం

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతలకు నిరీక్షణ తప్పడం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర అవుతున్నా నామినేటెడ్ పదవుల నియామకంలో ఇంకా కొన్ని అవకాశాలను భర్తీ చేయడం లేదు. ప్రధానంగా జిల్లా, నియోజకవర్గ స్థాయి పలు పదవులతో పాటు, గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆలయాల చైర్మన్ల పదవులపై కన్నేసిన నాయకులు నిర్విరామంగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తునే ఉన్నారు.

పార్టీలో సీనియర్లకు పెద్దపీట వేయాలనే ఆలోచనతో పీసీసీ నేతలు ఉండడం, మంత్రివర్గ విస్తరణ తర్వాత నామినేటెడ్ పదువలపై నిర్ణయాలు తీసుకుంటామని ఎమ్మెల్యేలకు, పార్టీ ఇన్‌చార్జిలకు తెలియజేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ క్రమంలో సంవత్సరాల తరబడి పార్టీలో పని చేశాం... అయినా సరైనా గుర్తింపు దక్కడం లేదన్న నైరాశ్యం కొంతమంది కాంగ్రెస్ నేతల్లో నెలకొంది.

జిల్లాలో రాజకీయ పరిస్థితి ఇలా...

జిల్లాలో సుమారు ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజయం సాధించి ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. జగిత్యాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ గెలుపొందినప్పటికీ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా సంజయ్‌కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నారు. అదేవిధంగా కోరుట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గెలుపొందగా, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్ గెలుపొందారు. నామినేటెడ్ పదవుల భర్తీలో ఆయా నియోజక వర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల పాత్ర కీలకంగా ఉంటుంది. వీరు ప్రతిపాదించిన వారికే నామినేటెడ్ పదవులు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

'స్థానిక' ఎన్నికల తర్వాతేనా..?

ప్రత్యేకాధికారుల పాలనతో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక వర్గాలకు ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల్లోనూ కీలకమైన ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్ పదవుల పైనా చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటి నుంచే జోరుగా నమ్మకంతో నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారికి కాకుండా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కాకుండా మిగిలిని వారికి ఇచ్చే చాన్స్ ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

దీనికి తోడు పార్టీలో పదేళ్ల పైబడి పనిచేసిన వారికి ముందు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఇటీవల తెలిపిన అంశం సైతం చర్చల్లోకి వస్తోంది. ఈ పరిణా మాలన్నీ కూడా నామినేటెడ్ పదవులను సీనియర్లకే అన్నట్లుగా సుస్పష్టం చేస్తున్నాయి. అంతే కాకుండా పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పని చేసిన నేతలకే అవకాశాలు దక్కుతాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

జగిత్యాల కాంగ్రెస్‌లో ప్రత్యేక పరిస్థితి..

జిల్లాలోని జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక పరిస్థితి నెలకొంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సీనియర్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి విజయం సాధించలేకపోయారు. బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ గెలుపొందారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కండువాను మార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పని చేసిన ద్వితీయ శ్రేణి నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాలని, కాంట్రాక్టు పనులు గానీ, ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం గానీ దక్కాలని జీవన్ రెడ్డి వర్గీయులు వాదిస్తున్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులతో, కాంగ్రెస్ నేతలతో చనువుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వర్గీయులు సైతం పదువులు, పనులు ఆశిస్తున్నారు. దీంతో జగిత్యాల నియోజకవర్గంలో పదువులు, కాంట్రాక్టు పనులు ఎవరు దక్కుతాయోనని సందిగ్ధ పరిస్థితి నెలకొంది.

జిల్లా, నియోజకవర్గ పదవులపై ఆశలు...

నామినేటెడ్ పదవుల్లో రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పలు పదవులున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలు, గ్రంథాలయ కమిటీలతో పాటు మరికొన్ని సైతం ఉన్నాయి. ఇందులో మార్కెట్లు, మిగతా 10లో

జిల్లాలో మండుతున్న ఎండలు



జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ఎండలు మండుతున్నాయి. జిల్లాలో శుక్రవారం వరకు 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా శనివారం రెండు డిగ్రీలు పెరిగాయి. జిల్లాలోని 14 మండలాల్లో 40 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్ మండలంలో శనివారం అత్యధికంగా 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణో గ్రత నమోదు అయింది. ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, మెట్‌పల్లిలో 42.0, ధర్మపురి మండలం జైనా, భీమారం మండలం మన్నేగూడెంలో 41.9, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 41.7, మల్లాపూర్ మండలం రాఘవపట్నం, రాయికల్ మండలం అల్లీపూర్, మేడిపల్లి మండల కేంద్రం లో 41.6, ధర్మపురి మండలం బుద్దేశపల్లి, కోరుట్ల పట్టణంలో 41.5, బీర్ పూర్ మండలం కొల్వాయి, రాయికల్, పెగడపల్లిలో 41.4 డిగ్రీల ఉష్ణోగ్ర త నమోదైంది. ధర్మపురి మండలం నేరెళ్ల, సారంగాపూర్‌లో 41.3, మల్యాల మండలం మద్దుట్లలో 41.1, మల్లాపూర్‌లో 41.0, ఎండపల్లి మం డలం మారెడుపెల్లి, గొల్లపల్లి మండల కేంద్రంలో 40.9, కథలాపూర్‌లో 40.8, మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో 40.3, బుగ్గారం మండలం సిరికొండలో 40.2, భీమారం మండలం గోవిందారంలో 40.1, ఎండపల్లి, జగిత్యాల మండలం పొలాస, మల్యాలలో 40.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 39.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది.

బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన జరుపుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి సమీపంలో బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహ ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. శనివారం పలువురు సంఘ నాయకులతో కలిసి మంచినీళ్ల బావి ప్రాంతాన్ని సందర్శించారు. బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహ ఏర్పాటు స్థల ఎంపిక వ్యవహారంలో స్థానిక నాయకులు, పలు సంఘాల సభ్యుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. సాధ్యమైనంత తొందరలో బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పలువురు నాయకులు, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్



కథలాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే సంకల్పంతో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మహిళలను వ్యాపారాల్లో రాణించేలా చూసే క్రమంలో వారికి కేంద్రాల నిర్వాహణను అప్పగించిన ఘనత వైఎస్‌ఆర్‌కే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి చూపించారన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు రైతుల క్షేమాన్ని విస్మరించిందని, సూరమ్మ చెరువు పనులను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూంద్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్ రెడ్డి, న్యావనంది శేఖర్, సత్యనారాయణ, రుద్రంగి ఏఎంసీ చైర్మన్ తిరుపతి, లింగారావు, ఏపీఎం నరహరి, సీసీలు విజయలక్ష్మీ, అంజయ్య ఉన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు అభినందనీయం

కోరుట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినంద నీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని పాత మున్సిపల్ వద్ద లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అల్లాడి శోభ-ప్రవీణ్, గుంటుక కవిత, పోతని శ్రీలక్ష్మి, మంచాల రోజారమణి, ప్రవీణ్ కుమార్, ప్రకాష్, ఎలిమెల్ల రాం నారాయణ, మంచాల జగన్ పాల్గొన్నారు.

అంబారిపేటలో గిరిప్రదక్షిణ

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేటలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా గిరి ప్రదక్షిణలో అంబారిపేట గ్రామస్థులు, పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



నాలుగు దశాబ్దాలకు జనజీవన స్రవంతిలోకి..

● స్వగ్రామానికి చేరిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు



కాంకేట్ ఎస్పీ నుంచి విడుదల పత్రం అందుకుంటున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల/కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పోరాటంలో నాలుగు దశాబ్దాలుగా వివిధహోదాల్లో పనిచేసి పోలీసుల ఎదుట లొంగిపోయిన మండలంలోని సిరికొండకు చెందిన బత్తుల గాంబాలు అలియాస్ పసుల వసంత శనివారం స్వగ్రామం చేరుకున్నారు. పీపుల్స్ వార్‌లో కోరుట్లకు చెందిన భర్త పసుల రాంరెడ్డితో కలిసి పలురాష్ట్రాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. భర్త రాంరెడ్డి2001లో మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో మరణించగా వసంత పార్టీలోనే కొనసాగారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నార్త్ బస్తర్ డివిజన్ ఇన్‌చార్జిగా, ప్రాంతీయ ఆదివాసీ మహిళా సంఘటన్ సీవోగా, కేంద్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగిన వసంత అనారోగ్య కారణాలతో గత ఏడాది సెప్టెంబరులో కాంకేర్ జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయారు. పూర్తిస్థాయిలో కుటుంబసభ్యుల వివరాలు సేకరించిన పోలీసులు శనివారం కుటుంబసభ్యులకు విడుదలపత్రం అందజేస్తూ అప్ప గించారు. కూతురు భవానీ, మేనల్లుడు బత్తుల నరేశ్ కాంకేర్ వెళ్లి వసంతను స్వగ్రామానికి తీసుకువచ్చారు. దాదాపు నలభై సంవత్సరాల తర్వాత ఇంటికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మేనల్లుడు నరేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పక్కాసమాచారంతో మంథని శివారులోని పోచమ్మగుడి సమీపంలో డబ్బులు పెట్టి పేకాటఆడుతున్న ఏడుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఇప్పపల్లిలో మహిళ అదృశ్యం



దేవేంద్ర (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లిలో యాగండ్ల దేవేంద్ర(50) అనే మహిళ అదృశ్యమైంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లినదేవేంద్ర ఇంటికిరాకపోవడంతో కుటుంబసభ్యులు కలవరపడ్డారు. ఈక్రమంలో భర్త భూమయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కొంతకాలంగా దేవేంద్ర కుటుంబం అప్పులబాధతో సతమతమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

'ఐసర్'తో IISER బంగారు భవిష్యత్తు



- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏడు విద్యాలయాలు
- ఇంటర్ విద్యార్థులకు ప్రవేశం
- ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు
- భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులను తీర్చిదిద్దడమే లక్ష్యం

చొప్పదండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాస్త్రవిద్యను ప్రోత్సహించడం, విద్యార్థులను భవి ష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులుగా తీర్చి ద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఐసర్ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఐఐటీకి దీటుగా సైన్స్ విద్యార్థుల కోసం ఐసర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యు కేషనల్ రీసెర్చ్) విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం 2006లో ప్రారంభించింది. ప్రస్తుతం దేశంలో ఏడు విద్యాలయాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థలు శాస్త్ర రంగంలో అత్యుత్తమ విద్యను, పరిశోధన అవకాశాలను అందిస్తున్నాయి. ఇంటర్ తర్వాత ఎంపీసీ విద్యార్థు లకు ఐఐటీలో ప్రవేశాల మాదిరిగా బైపీసీ ఆధ్వర్యంలో ఐసర్‌లో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను చేర్చుకుంటాయి. ప్రస్తుతం ఐసర్‌లో ప్రవేశానికి ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఆ వివరాలు విద్యార్థుల కోసం..



● ముఖ్యమైన తేదీలు

- విద్యార్థులు ఐసర్ పోర్టల్‌లో ఏప్రిల్ 15 లోగా దరఖాస్తులు సమర్పించుకోవాలి.
- దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఏప్రిల్ 21, 22న అవకాశం కల్పిస్తారు.
- హాల్‌టికెట్ల విడుదల మే 15
- ప్రవేశ పరీక్ష మే 25న నిర్వహిస్తారు.
- ఐసర్ పోర్టల్: www.iiseradmission.in

● బీఎస్, ఎంఎస్ డ్యుయల్ డిగ్రీ...

ఐఏటీ (ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్) ద్వారా ఇంటర్ సైన్స్ విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా విద్యాల యంలో ప్రవేశం కల్పిస్తారు. బీఎస్, ఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఐన్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్) ఐదేళ్ల కోర్సును ఆఫర్ చేస్తున్నారు. మొదటి రెండు సంవత్సరాలు ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల్లో విద్యా బోధన చేస్తారు. తర్వాత రెండు సంవత్సరాల్లో వి ద్యార్థి తనకు ఇష్టమైన సబ్జెక్టులో స్పెషలైజేషన్ ఎంచుకోవాలి. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్టు ఉంటుంది.

● ప్రవేశ పరీక్ష...

ఐసర్‌లో ప్రవేశానికి మూడు మార్గాలు ఉం టాయి. కేవీపీవై, ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ చానల్ (ఐఐటీలో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులకు అవకాశం ఉంటుంది). ప్రధానంగా ఐసర్ యాప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహించి విద్యార్థులను మెరిట్, కేటగిరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో పీసీఎంబీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోలజి) సబ్జెక్టులు చదివిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులు. పదో తరగతిలో 60 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలకు 55 శాతం మార్కులు ఉండాలి. ప్రవేశ పరీక్షలో 60 ప్రశ్నలు ఉండగా ఒక్కో సబ్జెక్ నుంచి 15 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి జవాబుకు నాలుగు మార్కులు ఉంటాయి, తప్పు సమాధానికి 1 మైనస్ మార్కు ఉంటుంది. మొత్తం 240 మార్కులకు పరీక్ష ఉంటుంది.

● దేశంలో ఏడు విద్యాలయాలు..

దేశంలో ఏడు ఐసర్ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం స్థాపించింది. ఐసర్ పూణే, కలకత్తా, మొహాలీ, భోపాల్, తిరువనంతపురం, తిరుపతి, బరంపురంలో విద్యాలయాలు ఉన్నాయి. దేశంలో మొత్తం 2,363 సీట్లు ఉండగా తిరుపతి ఐసర్‌లో 350 సీట్లు, బరంపురం 300, భోపాల్ 300, తిరువనంతపురం 320, పుణే 288, కలకత్తా 280, మొహాలీలో 270 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా భోపాల్ ఐసర్‌లో బీటెక్ విభాగంలో 140 సీట్లు, ఎకనామిక్స్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఐసర్‌లో టాప్ లెవల్ సైన్స్ విద్యను ఫ్యాకల్టీ అందిస్తుండగా, ఉన్నతస్థాయి ల్యాబ్‌లు, అంతర్జాతీయ సంస్థలు అనుసంధానం, రీసెర్చ్ అవకాశాలను కల్పిస్తున్నాయి. విద్యార్థులకు ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తూ అధునాతనమైన హాస్టల్ వసతిని విద్యాసంస్థలు కల్పిస్తున్నాయి.

వంతెనపై భారీ వాహనాలు ఢీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ● సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు

కోరుట్లరూరల్ (మెట్‌పల్లిటౌన్), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ జాతీయ రహదారిపై ఉన్న వంతెనపై రెండు భారీవాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. వంతెనపై భారీ వాహనాలు ఢీకొట్టుకోగా వాహనంలోని క్యాబిన్‌లో లారీ డ్రైవర్ ఇరుక్కున్నాడు. గమనించిన స్థానికులు అతి కష్టంమీద బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఎస్ఐలు భారీ వాహనాలను ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. అప్పటి వరకు జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.



ప్రమాదానికి గురైన భారీ వాహనాలు

వరుస దొంగతనాలతో వణికిపోతున్న అన్నారం గ్రామస్థులు

● రాత్రివేళ గస్తీ తిరుగుతున్న యువకులు

● పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాలు

మానకొండూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో వరుస దొంగతనాలతో గ్రామస్థులు వణికిపోతున్నారు. మార్చి 25న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లలో చొరబడి నగదు, బంగారు, ఆభరణాలు, మోటార్‌సైకిల్‌ను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 9న అర్ధరాత్రి గ్రామ సమీపంలోని వరాహగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి స్వామివారి హుండీని పగులకొట్టి నగదు అందులోని నగదు, స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. 15రోజులలో రెండు వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతనెల 25న ఒకేరోజు గొట్టిముక్కల విజయ, మధునాల వెంకటమ్మ, రుద్రోజు వెంకటాచారి ఇంటి తాళాలు పగులకొట్టి నగదు, నగలు, పాకాల రాజిరెడ్డి ఇంటి ముందు పార్కు చేసిన మోటార్ సైకిల్‌ను ఎత్తుకెళ్లారు. ఇలా వరుస దొంగతనాలతో రాత్రి వేళలో యువకులు కర్రలను పట్టుకొని వీధులలో గస్తీ తిరుగుతున్నారు. ఇప్పటికి 18రోజులైనా దొంగలు పట్టుబడక పోవడం పోలీసులకు సవాలుగా మారింది.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

● కాలిబూడిదైన ధాన్యం, గోనె సంచులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రికర్ల గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లులో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారు రెండుకోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని గంగారెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున ప్రమాదవశాత్తు రైసు మిల్లులో నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు రావడాన్ని అక్కడే ఉన్న కూలీలు గమనించి యజమాని గంగారెడ్డితో పాటు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి అగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలార్పి వేశారు. రైసుమిల్లు షెడ్‌తో పాటు సుమారు ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం, 80వేల పాత, 10వేల కొత్త గోనె సంచులు కాలిబూడిదైనట్లు యజయాని తెలిపారు. దీంతో సుమారు రెండు కోట్ల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన చెందారు. రైస్ మిల్లును సివిల్‌సప్లయి అధికారులు, ఆర్ఐ ఉమేష్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

తొలితరం కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయాం



కాంతారావుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకుడిని కోల్పోయిందని సీపీఐ జాతీయకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకటరెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు తానిపర్తి కాంతారావు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టు నాయకుడని, మంచి ఆదర్శ భావాలున్న వ్యక్తి అని కొనియాడారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించడం గొప్పవిషయంగా చెప్పుకొచ్చారు. వారిత్యాగాలు, జీవిత విశేషాలు నేటి కమ్యూనిస్టు నాయకులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసి పేద, అట్టడుగువర్గాల సంక్షేమానికి నిరంతరం కృషిచేశారన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కలవేణశంకర్, జిల్లాకార్యదర్శులు తాండ్రసదానందం, మేకలదాస్, జిల్లా ఏఐటీయుసీ ప్రధానకార్యదర్శి కడారి సునీల్, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, నాయకులుతానిపర్తిమోహన్ రావు, ఆయన కటుంబసభ్యులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదా విషయమై హత్యాయత్నం కేసులో సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కలికోట పృథ్వి(23), కలికోట రేణుక(39), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పాతూరి సాయికృష్ణ(34), సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నక్క వెంకటేశ్(24), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పేయింటర్ సృజన్(21), సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెయింటర్ కనకం నరేశ్(38)లను శనివారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. నిందితుల వద్ద ఒక కత్తి , ఆరు మొబైల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్, ఒక కారును సీజ్‌చేశామని ఆయన తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... కలికోట రేణుక తన మరిది వెంకటేశ్‌కు మధ్య ఇంటి దారి విషయమై గత కొద్దిరోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. రేణుక చిన్న కొడుకు పృథ్వి ఎల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి సాయికృష్ణ అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తుం డేవాడు. రేణుక భర్త చనిపోవడంతో కాంట్రాక్టర్ సాయికృష్ణకు రేణుక సాన్నిహిత్యం పెరిగింది. రేణుక తన మరిది వెంకటేశ్ మధ్య గొడవలు జరుగుతుండటంతో వెంకటేశ్‌ను అతని కుటుంబాన్ని పృథ్వీచేత చంపించాలని సాయికృష్ణ, రేణుక కలిసి పథకం వేశారు. ఈ పథకంలో భాగంగానే తన మరిదితో దారి విషయం గొడవ ఉందని, ప్రతి రోజు తనను బూతులు తిడుతున్నారని వెంకటేశ్ కుటుంబాన్ని చంపివేస్తే ఇల్లు , స్థలం మనకే వస్తుందని కుమారుడు పృథ్విని పురమాయించారు. ఇందుకు రేణుక, సాయికృష్ణలు కలిసి పృథ్వి తన స్నేహితులైన కనకం నరేశ్, సృజన్, వెంకటేశ్‌లకు మద్యం తాగించి తన బాబాయ్ కుటుంబాన్ని అంతమొందించాలని పథకం ప్రకారం ఈ నెల 8న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి ఆరుగురు నిందితు లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో పెద్ద కత్తి పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి రాకేశ్(26) అనే వ్యక్తిని శనివారం రాత్రి అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇతని వద్ద ఒక పెద్ద కత్తి, చిన్న బటన్ చాక్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కూలి చేసుకుంటే జీవించే రాకేశ్ తాగుడుకు బానిసై గతంలో వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. మళ్లీ సిరిసిల్లలో తిరుగుతూ భయానక వాతావరణ సృష్టించాలని కరీంనగర్‌లో పెద్ద కత్తి కొనుగోలుచేసి ద్విచక్రవాహనంలో పెట్టుకొని తిరుగుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదుచేసి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● పేలిన వంటగ్యాస్ సిలిండర్



ఇంట్లో నుంచి వస్తున్న పొగలు

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సిరికొండలో సుద్దాల బుచ్చిరాజు అనే మహిళకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో శనివారం దగ్ధమైంది. కొన్నేళ్ల క్రితం బిగించిన విద్యుత్‌వైర్లు సరిగా లేకపోవడంతో షార్ట్‌సర్క్యూట్‌కు కారణమైంది. మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు లేచిపోయింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇతరత్రా సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. పక్క ఇంట్లో ఉన్న ఆశా కార్యకర్తకు చెందిన రిజిస్టర్లు కాలిపోయాయి. మరో పక్కన సుద్దాల నరేశ్ అనే కానిస్టేబుల్ ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో నుంచి మంటలు వస్తున్న విషయం గమనించిన స్థానికులు ఆ ఇంట్లో ఉన్న అంధురాలైన వృద్ధురాలిని హుటాహుటిన బయటకు తెచ్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని నష్టానికి సంబంధించిన వివరాలను అంచనా వేశారు.

ఆర్టీసీ బస్సులో యువకుడి అసభ్య ప్రవర్తన

తంగళ్లపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో మద్యం తాగిన ఓ వ్యక్తి యువతులపై అసభ్యంగా ప్రవర్తించడంతో దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే సిద్ధిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి సిద్ధిపేటకు వెళ్తున్న సమయంలో మధ్యలో మద్యం సేవించిన ఓ ప్రయాణికుడు ఎక్కాడు. బస్సు తంగళ్లపల్లి మండలం సారంపల్లి మీదుగా వెళ్తున్న సమయంలో మద్యం మత్తులో ఆ వ్యక్తి యువతులతో అసభ్యంగా ప్రవర్తించాడు. యువతులు అతన్ని ప్రశ్నించడంతో వారిపై దాడికి యత్నించాడు. దీంతో యువతులు అతనికి దేహశుద్ధి చేశారు. డ్రైవర్ బస్సును నిలిపి నేరెళ్లలో అతన్ని దింపివేశాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఓ ప్రయాణికుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

● పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి బంధువుల ఫిర్యాదు



కమిలిపోయిన విద్యార్థి వీపు

గంభీరావుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి విద్యార్థిపై ఓ ఉపాధ్యాయుడు ప్రతాపం చూపించాడు. విద్యార్థి వీపుపై బాదడంతో తీవ్రంగా కమిలిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రాథమిక పాఠశాలలో లవన్‌సాయి అనే ఆరేళ్ల బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం తరగతి గదిలో ఉపాధ్యాయుడు దేవరాజు లవన్‌సాయి అల్లరి చేస్తున్నాడని తీవ్రంగా కొట్టాడు. దెబ్బ లకు విద్యార్థి వీపు ఎర్రగా కమిలిపోయింది. సమాచారం అందు కున్న విద్యార్థి బంధువులు పాఠశాలకు చేరుకుని ప్రశ్నించగా అప్పటికే ఉపాధ్యాయుడు దేవరాజు పాఠశాల నుంచి జారుకు న్నాడు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రామచంద్రంపై విద్యార్థి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లవన్‌సాయిని సిరిసిల్ల ఆసుపత్రికి తీసు కెళ్లి చికిత్స అందించారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అందని పరిహారం

● నిలిచిన అప్రోచ్‌రోడ్డు పనులు

● ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలంటున్న మండల ప్రజలు



గుంతలమయమైన మట్టి రోడ్డు


రామడుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామడుగు బ్రిడ్జి నిర్మించిన అధికారులు దానికి అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. రామడుగు వాగుపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిస్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఏడుసంవత్సరాలక్రితం సుమారు రూ.8కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు డబ్బులు చెల్లించకపోవడం, తదితర కారణాలతో ఆరు సంవత్సరాలపాటు నత్తనడకన పనులు సాగాయి. దాదాపు 8మంది నిర్వాసితులు ఉండగా వారికి కోటి55లక్షల రూపాయల పరిహారం రావాల్సి ఉందని తెలుస్తోంది. పాతబ్రిడ్జి గత వానలకు పూర్తిగా కూలిపోయింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు త్వరలోనే డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో పనులు కొనసాగుటకు రైతులు సహకరించారు. దీంతో బ్రిడ్జినిర్మాణం పూర్తవగా కొద్దినెలలుగా వాహనరాకపోకలు కొనసాగుతున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో వానలకు గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం వేసవినేపథ్యంలో దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఒక దశలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు ఇప్పటివరకు డబ్బులు అందకపోవడమే ప్రధానకారణం.

ఓవైపు డబ్బులు రాక రైతులు ఆందోళన చెందుతుండగా మరోవైపు మండల ప్రజలు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు పరిహారం అందితే తప్ప నిర్మాణం జరిగే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రైతులకు పరిహారం ఇప్పించి అప్రోచ్ రోడ్డు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జైన విగ్రహాన్ని కాపాడుకోవాలి

● డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



జైన విగ్రహం వద్ద డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సుమారు 1100ఏళ్లనాటి చరిత్రకు నిదర్శనం పాతబజార్ గౌరీశంకరాలయమని, ఆ ఆలయ ప్రాంగణంలోని జైన విగ్రహంపై రంగులు తొలగించి కాపాడాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియాఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానిక యువ చరిత్ర పరిశోధకుడు కొల్లూరి శివకుమార్ సమాచారంతో శనివారం ఆలయంలో జైన విగ్రహాన్ని పరిశీలించారు. వేములవాడ చాళక్యుల కాలపు ఈవిగ్రహం24 తీర్థంకరులలో ఒకరైన సుపార్శ్వనాథ్‌గా తెలిపారు. విగ్రహం భూమిలో కూరుకపోయి ఎర్రని రంగు పూయడంతో 1100 సంవత్సరాల చరిత్ర కోల్పోయామన్నారు. ఇప్పటికైనా చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ విగ్రహానికి రంగులు తొలగించి భద్రత కల్పించాలని ఆలయ అధికారులకు, కరీంనగర్ జైన సంఘం బాధ్యులకు విజ్ఞప్తి చేశారు. మరో జైన విగ్రహం ఉండగా ధ్వంసమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, కొల్లూరి సాయికుమార్, శిల్పి బి సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బోయినపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని మల్లాపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. శనివారం మల్లాపూర్ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించడంతో వారి వద్ద నుంచి 8,200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు రెండు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

దాగుడు మూతలు.. దండాకోర్!



● కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలు

● చిన్నారులకు వేసవిలో ఆటవిడుపు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పచ్చనైన పల్లె సీమల్లో మట్టి పరిమళాల మధ్య సంప్రదాయ గ్రామీణ క్రీడల్లో శారీరక ఆరోగ్యం పెంపొందించుకున్న కాలం నుంచి స్మార్ట్ ఆటల యుగం నడుస్తోంది. ఈ హైటెక్ ఆటల ముందు ప్రాచీన గ్రామీణ క్రీడలు చిన్నబోతున్నాయి. నిజానికి వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆట విడుపు. సెలవుల్లో పిల్లలకు వేసవి శిబిరాలు లేకపోతే ఇంట్లో టీవీ, వీడియో గేమ్స్, బయటకొస్తే క్రికెట్.. ఇది మాత్రమే ఇప్పటి పిల్లలకు అలవాటు. ఒకసారి వెనక్కి వెళ్లి చూస్తే గతంలో పల్లెల్లో ఆడుకున్న ఆటలు.. పాడుకున్న పాటలు గుర్తుకు వచ్చి.. ఈనాటి బాల్యం ఎలాంటిదని ఆలోచిస్తే బాధ కలుగకమానదు. శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసాన్ని అందించే గ్రామీణ ఆటలు ఎన్నెన్నో ఉన్నాయి. ఈ వేసవిలో పిల్లలు ఆడుకోదగ్గ ఆనాటి అద్భుతమైన ఆటల్ని మీకు పరిచయం చేయటమే ఈ ప్రయత్నం. ఈ ఆటల్లో సిర్రగొనె, గోళీలాట, దెబ్బలచండీ, అష్టచెమ్మా, కాసెపుల్ల, బొంగరాలాట, కోతికొమ్మ, దస్తాట, పెండలబుర్రి, సీకాట, పావులాట, వీరి వీరి గుమ్మడి పండు, అగ్గిపెట్టెలతో ఫోన్ ఆట, సిగరెట్ పెట్టెలతో పత్తాలాట, రెస్, పాము నిచ్చెన, పుంజీతం, చిత్తు బొత్తు, వంగుడు-దుంకుడు, జంటల్‌టెక్క, ముట్టి చుకునుడు ఇలాంటి ఆటలు అనేక ఉన్నాయి.



● సిర్ర - గోనె

ఈతరం పిల్లలు ఆడుకునే క్రికెట్ ఆటను పోలి ఉంటుంది. సిర్ర - గొనె ఆట. దీన్నే గిల్లి దండా అని కూడా అంటారు. కనీసం ఇద్దరు కలిసి ఆడుకునే ఆట ఇది. ఈ ఆటకు రెండు కర్ర వస్తువులు అవసరం పడతాయి. అవే సిర్ర - గోనె తొలుత బద్దీలో సిర్రను ఉంచి గోనెతో చిమ్ముతారు ఒక్కరు. పైకెగిరిన సిర్రను బుక్క (క్యాచ్) పడితే చిమ్మిన వారు ఔటయినట్లు లేనిచో ఆ సిర్రను బద్దీ వైపు విసురుతారు. అది బద్దీ వద్ద పడకుండా చిమ్మిన వ్యక్తి గోనెతో అడ్డుకుంటాడు. అచ్చం ఆధునిక బ్యాటింగ్ లాగా అడ్డుకోవడంలో విఫలమై ఆ సిర్ర బద్దీకి గోనె కంటే తక్కువ దూరంలో పడితే చిమ్మిన వ్యక్తి క్లీన్‌బౌల్డ్ లాగా ఔటయినట్లు లెక్క. ఒక వేళ సఫలమే అయితే సిర్రను గోనెతో కొట్టి పైకి లేపి మళ్లీ బలంగా బ్యాటింగ్ లాగా విసిరి కొడతాడు. దూరాన్ని గోనెతో కొలిచి రన్స్ లాగా స్కోరింగ్ చేసుకుంటారు.



● వీరి వీరి గుమ్మడి పండు..

పిల్లల సమూహం నుంచి ఒకరిని పెబ్బగా ఎన్నుకుంటారు. మిగిలిన వారిని వరుసగా నిలబెట్టి అందులో ఒకరిని దొంగగా భావించి పెబ్బ కళ్లు మూస్తారు. ఎదురుగా ఉన్న పిల్లల నుంచి ఒకరిని సైగ ద్వారా ముందుకు రమ్మని పిలుస్తారు. వారి దిక్కు వేలెత్తి చూపుతూ వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేంటని కళ్లు మూసుకున్న వారిని అడుగుతారు. సరైన పేరు చెప్పగలిగితే ఆ పేరు గల వ్యక్తి దొంగవుతారు. అబద్ధమైతే ముందుకొచ్చిన వారు ముక్కుపై గిచ్చి వెళతారు.



● కాసె పుల్ల

ఇసుకలో కూర్చుని ఇద్దరాడుకునే ఆట ఇది. ఆటగాళ్లలో ఒకరు మూరెడు సైజులో ఇసుక కట్టను చేసి అందులో ఒక కట్టెపుల్లను తెలియకుండా వదిలి పెట్టాలి. తర్వాత ఇంకో క్రీడాకారిణి ఆ పుల్లను ఎక్కడుందో గుర్తు పట్టడానికి ఇసుక కట్టపై ఒక చేతివేళ్లను ఇంకో చేతివేళ్లలో అల్లుకున్నట్లుగా చేసి రెండు చేతులతో మూస్తారు. ఆ పుల్ల ఆ చేతుల కింద ఉన్నట్లుయితే దాచి పెట్టే అవకాశం వస్తుంది. కనుక్కో లేని పక్షంలో ఓడిపోయారని దోసిల్లో ఇసుకను నింపి అందులో పుల్లపెట్టి.. గెలిచిన వారు ఓడిన వారి కళ్లు మూసి ఎక్కడో దూరంగా తెలియని ప్రదేశంలో ఆ ఇసుక కుప్పను పారబోయిస్తారు. యధాస్థానానికి వచ్చిన తర్వాత కళ్లు తెరిపిస్తారు. పారబోసిన ఇసుక కుప్పను కనుక్కోవడం ఆసక్తి కరంగా ఉంటుంది.



● దస్తాట

ఓ డజను మంది పిల్లలు వృత్తాకారంలో తలను నేలకేసి వంచి కూర్చుంటారు. అందులో ఒకరు రుమాలు (దస్తి)ను పట్టుకొని వారి వెనకాల మూడు రౌండ్లు తిరిగి ఒకరి వెనక వేస్తారు. వారు గుర్తించి వెంటనే లేచి దస్తీ పట్టుకొని రౌండ్లు కొట్టి మరొకరి వెనక వేయాల్సి ఉంటుంది. దస్తీ తన వెనకున్న విషయం ఆలస్యమైతే మిగతా పిల్లలు వీపులో పిడికిలి గుద్దులు గుద్దుతారు.



● గోలీలాట.. (లక్కాట)

గోలీలాటలో ఇది ఒక భాగం. ఈ ఆటను ఎంతమందైనా ఆడుకోవచ్చు. ఒకప్పుడు పల్లెటూళ్లలో ఈ ఆటను పిల్లలు బాగా ఆడుకునేవారు. ఈ ఆటతో వారి సృజనాత్మకత కూడా పెరిగేది. వృత్తంలో ఉన్న గోలీలను గురి చూసి కొట్టడం ఈ ఆట ప్రత్యేకత. గురి చూసి కొడితేనె గెలుపు. ఈ ఆట ఇప్పుడు దాదాపు కనుమరుగైంది.



● అష్టాచెమ్మ

కొంచెం అటు ఇటుగా ఈ ఆట పచ్చీసును పోలి ఉంటుంది. నలుగురులోపు ఆటగాళ్లు దీన్ని ఆడతారు. చింతగింజలు, రాళ్లను పావులుగా వాడుకుంటూ గవ్వలతో పందెం కాస్తారు. ఇందులో అష్ట చెమ్మ అనే ప్రధాన పదాలుంటాయి. ఎవరు ముందు పావులతో ఇంటికి చేరితే వారు గెలిచినట్టు.



● కోతి కొమ్మ

వేసవి సెలవుల్లో పిల్లల్ని తోటల వైపు ఆకర్షించి చెట్లపై కోతులుగా మార్చే ఆట ఇది. ఈ ఆటలో పెద్ద పెద్ద కొమ్మలున్న చెట్టును ముందుగా ఎంచుకుంటారు. ఆటకు ముందు ఆడే పిల్లలు చప్పట్లతో ఒకరిని దొంగగా గుర్తిస్తారు. మిగిలిన వారందరూ చెట్టెక్కి కొమ్మల మీద కోతిచేష్టలతో దొంగను ఆటపట్టిస్తుంటారు. దొంగ పిల్లాడు కూడా చెట్టెక్కి ఎవరో ఒకర్ని ముట్టుకుంటే అతడు తర్వాతి ఆటలో దొంగగా రావాల్సిందే. ఆ లోపు ఆటగాళ్లందరూ దొంగకు చిక్కకుండా చెట్టు దిగడమో.. లేదా చెట్టు కింద గీయబడ్డ వృత్తంలో దూకుతారు. అన్నట్టు చిన్నారులూ.. ఆట బాగుంది. కదాని రెచ్చిపోతే చెయ్యి. కాలు విరగ్గొట్టుకోవడం ఖాయం. జరంత జాగ్రత్త.

జై హనుమాన్



నృత్యాలు చేస్తూ వస్తున్న దీక్షాపరులు

● కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి ● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో స్వామి పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. భక్తులు శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం శనివారం రాత్రి కాషాయవర్ణాన్ని పులుముకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని 41, 21, 11 రోజుల దీక్ష బూనిన వారు మాల విరమణ చేశారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ జయంతిలో భాగంగా అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈవో శ్రీకాంత్‌రావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్ స్వామి, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండగట్టు అంజన్న స్వామిని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించారు.





కోనేరు వద్ద భక్తజనం

● కొండపైనే కలెక్టర్, ఎస్పీ మకాం..



సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీ పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ నిత్యం కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెండు రోజులుగా భక్తులు అధికంగా వచ్చే సమయంలో కొండపైన కలియతిరుగుతూ అర్ధరాత్రి వరకు కొండపైనే ఉంటూ, భక్తుల వద్దకు వెళుతూ సమస్యలు తెలుసుకొని తగు పరిష్కార సూచనలు ఇచ్చారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీ, దీక్షా విరమణ, దర్శనాలు తదితరవి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

● అడుగడుగునా ఇబ్బందులు.. భక్తుల అసహనం

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం జరిగిన హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రాగా అడుగడుగున భక్తులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తోడు మరో 366 మందిని అదనంగా ఉత్సవాల కోసం నియమించినప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడంపై మండిపడ్డారు. అలాగే భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లోనూ సకాలంలో నీరు అందుబాటులో ఉంచకపోవడంతో ఎండలతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. దీక్షాపరుల మాలవిరమణ సందర్భంగా కొందరు అర్చకులు డబ్బులు వసూలు చేయడం, తలనీలాలు సమర్పించే చోట క్షురకులు డబ్బులు ఇస్తేనే తలనీలాలు తీస్తామంటూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేశారు. ఎంతో భక్తిప్రపత్తులతో వస్తే బలవంతంగా వసూలు చేయడమేంటని భక్తులు ఆరోపించారు. స్నానాల కోసం కాంట్రాక్టర్లు రూ.20నుంచి 30వరకు వసూలు చేశారని అంజన్న సన్నిధిలో వ్యాపారులు అధిక ధరలతో తమను నిలువు దోపిడీకి గురి చేశారంటూ కొందరు భక్తులు ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఘాట్‌రోడ్డు పక్కన చలివేంద్రం దుస్థితి

వైభవంగా మహమ్మాయిదేవి జాతర

● తరలివచ్చిన భక్తులు

● ప్రత్యేక పూజలు, హోమాలు



మహమ్మాయి దేవి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాశక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న మహమ్మాయి దేవి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండను సైతం లెక్కచేయకుండా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మహామ్మాయి అమ్మ వారిని దర్శనం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు వాహనాలను కొంత దూరంలోనే పార్కింగ్ చేయించారు. వారం రోజులుగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం జాతర కావడంతో ఉదయంనుంచి భక్తుల తాకిడి మొదలయింది. ఆదివారం తెల్లవారుఝాము వరకు భక్తులు దర్శనం కోసం వస్తుంటారని ఆలయఉత్సవాల నిర్వాహకకమిటీ ప్రతినిధి దేవరకొండ కృష్ణమాచార్యులు తెలిపారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, పూర్ణాహుతి, అమ్మ వారికి అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎండల నుంచి ఉపశమనం కోసం చలువ పందిళ్లతో పాటు చల్లని నీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు.

నేడు పెద్దాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర

జూలపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ గ్రామశివారులో గల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదివారం జరగనుంది. ఆదివారం వేకువజామున రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు గొట్టెముక్కుల రవిందర్‌రెడ్డి, గొట్టెముక్కుల రాజభాస్కర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రథోత్సవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మంచిర్యాల, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులు వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు.



ముస్తాబైన యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

ఘనంగా చిన్న హనుమాన్ జయంతి





మడేలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, కోరుట్లలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాలలో సనాతన ధర్మ ధ్వజావిష్కరణలో పాల్గొన్న నాయకులు

ధర్మపురి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పలు హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి క్షేత్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి, గడ్డ ఆంజనేయస్వామి, హనుమాన్‌వీధి ఆలయాల్లో, చింతామణి చెరువు వద్ద భక్త జన సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది హనుమాన్ దీక్షా పరులు, భక్తులతో క్షేత్రం రద్దీగా మారింది. లక్ష్మీనృసింహస్వామి అనుబంధ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో, రావిచెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద స్వామి వారలకు రుద్రాభిషేకం, మన్యుసూక్త అభిషేకం, షోడశోపచార, సుందరకాండ పారాయణంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నది తీరాన గల గడ్డ అంజనేయస్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. గాదెపల్లిలో పంచకుండీయ గీతా యజ్ఞం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

జగిత్యాల క్రైం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అభయాంజనేయ, కోదండ రామాలయం, మార్కండేయ, విద్యానగర్ రామాలయం, మడేలేశ్వర స్వామి, భక్త మార్కండేయ, బంజరు దొడ్డి వాడలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనీల్ కుమార్, ఎమ్మెల్సీ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ధరూర్ క్యాంపులో ఉన్న కోదండ రామాలయంలో 41 అడుగుల సనాతన ధర్మ ధ్వజాన్ని ప్రముఖ వేద పండితుడు నంబీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజన్న దీక్షాపరులు పలు ప్రాంతాల్లో నగర సంకీర్తన నిర్వహించారు.

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ శివారులోగల చిన్నగట్టు అంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ అంజన్న, నాయకులు గంగాధర్, లింగారెడ్డి, కిషన్‌రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లూర్ రోడ్డులో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవంతో పాటు జయంతి వేడుకలను నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి అభిషేక అర్చన కార్యాక్రమాలను జరిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. పలు ఆలయాల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొని అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. పట్టణంలోని ప్రకాశం రోడ్డులోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో రాములోరి కళ్యాణంను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ గడ్డమీది పవన్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. పౌర్ణమి వేడుకలలో భాగంగా పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. దంపతులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్, చిన్నమెట్‌పల్లి ప్రత్యేక పూజలు, హోమంను నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణంను నిర్వహించారు.

కోరుట్ల రూరల్ (మెట్‌పల్లి టౌన్) పట్టణంలోని కాశిబుగ్గ, రామాలయంలో, గోల్ హనుమాన్ ఆలయాల్లో అంజనేయ దీక్షాపరులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. లయన్స్ క్లబ్, ఇండియన్ టైగర్స్ యూత్, వాసవి క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గోల్ హనుమాన్ ఆలయ నిర్వహకులు ఆంజనేయస్వామి పల్లకి సేవ నిర్వహించారు.

కొడిమ్యాల(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల రామాలయం, పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆలయ కమిటీ వారు దీక్షాపరులకు, గ్రామస్తులకు అన్నదానం చేశారు. వేములవాడ నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మాలవిరమణకు కాలినడకన వస్తున్న హనుమాన్ దీక్షా పరులు మండలంలోని నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని అభిషేకం, పల్లకి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

మల్యాల(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని ఆదపెర్మాండ్ల ఆలయం, మఠమాంజనేయస్వామి, మార్కండేయ ఆలయాలతో పాటు పలుగ్రామాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. మల్యాలలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు శోభాయాత్ర నిర్వహించారు.

పెగడపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెరువు గుట్ట అంజన్న ఆలయంలో హోమాలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గొల్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండంలోని రాఘవపట్నం గుండు ఆంజనేయ స్వామి ఆలయం, శ్రీరాములపల్లె, మల్లన్నపేట, శంకర్రావు పేట, బొంకూర్, చెందోళి, వెన్గుమట్ల, లక్ష్మీపూర్, ఆత్మకూర్, తిర్మలాపూర్ (పీడీ)తో పాటు మండల కేంద్రంలోని ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

రాయికల్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయంలో 54 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.



చిన్నగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు



ధర్మపురి క్షేత్రంలోని ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు





కోరుట్లలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు, ధర్మపురిలో ఆంజనేయస్వామివారికి హారతిఇస్తున్న అర్చకులు, మెట్‌పల్లిలో ఆంజనేయ స్వామి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు



బతికెపల్లి ఆలయంలో హోమంలో భక్తులు

భీమేశ్వర, పెద్దమ్మతల్లి జాతర

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్ల, హన్మాజీపేట గ్రామాల్లో గల భీమేశ్వరస్వామి, పెద్దమ్మ తల్లి జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. జాతర మొదటిరోజులో భాగంగా స్వామివార్ల కల్యాణ ఉత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పొరండ్ల గ్రామస్థులు, హన్మాజీపేట ముదిరాజ్ సంఘసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు భీమన్న జాతర

మల్లాపూర్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామ శివారున గల పెద్ద చెరువు తీరాన ఆదివారం జరిగే భీమన్న జాతరకు గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం భీమన్న కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగే జాతర, రథోత్సవానికి స్థానికులతో పాటు పలు గ్రామాల భక్తులు పాల్గొంటారు. చెరువు కట్ట రహదారిపై గల ముండ్ల పొదలను, చెట్ల కొమ్మలను స్థానిక గీత కార్మికులు తొలగించి శుభ్రం చేశారు. ప్రతీ ఆదివారం, గురువారాల్లో భక్తులు తమ మొక్కులు చెల్లించేందుకు ఆలయానికి వస్తుంటారు. అకాల రాళ్ల వర్షాల నుంచి తమ పంట పొలాలను రక్షిస్తూ అధిక దిగుబడికి దోహదపడే విధంగా భీమన్న స్వామిని పలువురు రైతులు కొలుస్తారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, పూజలను వేదపండితుడు మాదవచారి ఆధ్వర్యంలో పురోహితులు శ్రీవర్ధన్, ప్రవీణ్‌కుమార్ జరిపారు. ఆలయం కార్యనిర్వహణ అధికారి విక్రమ్‌గౌడ్ సమక్షంలో స్వామి వారికి ఎదుర్కోలు కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండి తులు ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం ారు. సాయంత్రం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఏనుగు రామనుజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు వాల్గొండ, సిర్పూర్, మొగిలిపేట, ముత్యంపేట, రేగుంట తదితర గ్రామాల ఆంజనేయ, శ్రీరామ ఆలయాల్లో భక్తులు పూజలు, అభిషేకం, అర్చనలు, హోమం నిర్వహించారు. పలువురు మాల విరమణ జరిపారు.

వైభవంగా గుంటి పెరమాండ్ల జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుంటి పెరమాండ్ల జాతర శనివారం వైభవోపేతంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలైన సిరికొండ, భూషణరావుపేట, దుంపెట, తక్కళ్లపల్లి గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామి సన్నిధానంలో బారులుతీరి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుచప్పుళ్లతో స్వామివారిని ఊరేగింపుగా తెచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొనగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్థానిక నేతలు శాలువాతో సత్కరించారు. భూషణరావుపేట, తాండ్ర్యాల, ఇప్పపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో హన్మాన్ జయంతి సందర్భంగా జాతరలు జరిగాయి. ఆంజనేయస్వామి దీక్షాపరులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం మాలధారులు దీక్షను విరమించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి



జయంతి కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ నక్క విజయ్ పిలుపునిచ్చారు. శనివారం జగిత్యాలలో ఉత్సవ కమిటీ కన్వీనర్లు పేట భాస్కర్, బొల్లి శేఖర్, బెజ్జంకి సతీష్, బంగారు దీపక్‌లతో కలిసి ఉత్సవ కరపత్రంను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి దళిత, బహుజన, అణగారిన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మకిలి ఇజ్రాయిల్, దూమాల రాజ్‌కుమార్, నక్క గంగాధర్, దుబ్బాక రమేష్, బోనగిరి దేవయ్య, బాలె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు తప్పని నిరీక్షణ

(7వ పేజీ తరువాయి..)

ఆలయాల కమిటీ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ల పదవులకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఈ పదవులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహులకు లింక్ చేసే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ఇప్పటికే కొన్ని మార్కెట్ కమిటీలు, ఆలయాల కమిటీలు భర్తీ కావడం, మరికొన్ని పెండింగ్‌లో ఉండడం వంటి పరిస్థితులు ఉన్నాయి. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకవర్గాల నియామకాల ప్రక్రియ ముందుకు వెళ్లడం లేదన్న అభిప్రాయాలున్నాయి. దీనంతటికి మంత్రివర్గ కూర్పు లేకపోవడమే కారణమని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రభావం సైతం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ ఎప్పుడు ఉంటుందో...తమను పదవులు ఎప్పుడు వరిస్తాయోనని ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు ఎదురుచూపులతో గడుపుతున్నారు.

గర్భాశయ క్యాన్సర్ నివారణకు కృషి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జగిత్యాల ఐఎంఏ అధ్యక్షుడు గూడూరి హేమంత్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఐఎంఏ హాలులో జగిత్యాల గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్‌ను అందించే విధంగా చర్యలు చేపట్టామని, జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పద్మిని మాట్లాడుతూ దేశంలో కాన్సర్ మరణాలు రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రతీఒక్కరు వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. 9 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మహిళలు వ్యాక్సిన్ తీసుకోవాలని అన్నారు. డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ శిబిరంలో 20 మంది బాలికలు మరియు మహిళలు వ్యాక్సినేషన్ తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కోటగిరి సుధీర్, డాక్టర్ వినీల, డాక్టర్ నాగరత్న, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌తో వృద్ధుల కేసులు పరిష్కారం

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కౌన్సెలింగ్‌తో వృద్ధుల కేసులకు పరిష్కారం అవుతుందని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిఅశోక్ కుమార్ శనివారం అన్నారు. తల్లిదండ్రులను పోషించకుండా నిరాదరిస్తున్న కొడుకులు, కోడళ్లకు హరిఅశోక్ కుమార్, ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్‌రావు, పీసీ హన్మంత్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాము తల్లిదండ్రులను పోషించి బాగా చూసుకుంటామని సమ్మతి పత్రం రాసి ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు యాకూబ్, పబ్బా శివానంద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కారుపై పడ్డ చెట్టు కొమ్మ



కారు ముందు భాగంపై పడిన చెట్టు కొమ్మ

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంపు శ్రీనగర్ కాలనీలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్టు కొమ్మ విరిగి కారుపై పడింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతిన్నది.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



కోనరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకోవడం వలన రక్తహీనత దూరమవుతుందని హెల్త్ సూపర్ వైజర్ ప్రభావతి అన్నారు. శనివారం మండలంలోని కోనరావుపుట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే లాభాల గురించి అవగాహన కల్పించి అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతో గర్భిణులు, పుట్టబోయే బిడ్డ, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాల ప్రాముఖ్యత, హ్యాండ్ వాష్, శానిటేషన్, బాలామృతము, బాలామృతంప్లస్ గురించి గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ సరోజా, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, సుజాత, స్వప్న పాల్గొన్నారు.

రాయికల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్‌లో శనివారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీవో మమత ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, స్థానిక ఆహార పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీవో మమత, సెక్టార్ సూపర్‌వైజర్ రాధ, మెడికల్ ఆఫీసర్, జెండర్ స్పెషలిస్ట్ గౌతమి, సఖి కేంద్రం రజిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అబుదాబిలో వెల్లుల్ల యువకుడి ప్రతిభ

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అబుదాబిలో నిర్వహించిన జానపద పాటల పోటీల్లో మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన బత్తిని రాజాగౌడ్ ప్రతిభ కనబరిచాడు. శనివారం ఆయన విలేకరులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అబుదాబిలో మా గల్ఫ్ కామ్ కార్మిక గీతాలాపన పదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జానపద పాటల పోటీల్లో మూడోస్థానంలో నిలిచాడు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

చిన్నారి మృతి బాధాకరం

బీర్‌పూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రెండో తరగతి చదువుతున్న చిన్నారి అకాల మరణం బాధాకరమని మండల విద్యాధికారి నాగభూషణం అన్నారు. బీర్‌పూర్ మండలంలోని కందెనకుంట గ్రామానికి చెందిన గడ్డం వైష్ణవి(10) అనే రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని రెండు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లకపోవడంతో వైష్ణవిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో శుక్రవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న మండలవిద్యాధికారి నాగభూషణం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ శనివారం బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కందెనకుంట పాఠశాలలో విద్యార్థులతో కలిసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు భాస్కర్‌కు సన్మానం

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు పేట భాస్కర్‌ను శనివారం కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ అధినేత గుండేటి రాజు జగిత్యాలకు రాగా పలువురు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాలె శంకర్, దుమాల రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ సేవా సమితి కార్యవర్గం

కొడిమ్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మాలాపూర్ గ్రామ హనుమాన్ సేవా సమితి కార్యవర్గాన్ని గ్రామస్థులు శనివారం ఎన్నుకున్నారు. హనుమాన్ సేవా సమితి గౌరవ అధ్యక్షుడిగా బొల్లం పాపిరెడ్డి, అధ్యక్షుడిగా మల్యాల మల్లేశం, ఉపాధ్యక్షులుగా తైదల రఘు, వొడ్నాల మల్లేశం, ప్రధానకార్యదర్శిగా వొడ్నాల సాయిలు ఎన్నికైనట్లు గ్రామస్థులు తెలిపారు.

జగిత్యాల పరిణామాలను అధిష్ఠానానికి వివరిస్తా

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జగిత్యాలలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ మధ్య చోటుచేసుకున్న విభేదాలను అధిష్ఠానానికి వివరిస్తానన్నారు. జగిత్యాలలో కొద్దిరోజులుగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ల మధ్య చోటుచేసుకున్న మాటల యుద్ధంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ కుటుంబపరంగా చిన్నచిన్న బేధాభిప్రాయాలు ఉంటాయని, వాటిని పరిష్కరించుకుం టామన్నారు. 120 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ చిన్నపాటి బేధాభిప్రాయాలు ఉండవా అని ప్రశ్నించారు. పదేళ్ల గడీల, రాచరిక పాలనను అంతమొందించి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు. అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో అవమానాలను బీఆర్ఎస్ పాలనలో ఎదుర్కొని, కష్టపడి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారని అన్నారు. పదవుల కొరకు ఫామ్ హౌజ్‌లో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు గతంలో తన్నుకున్నారని, ఆ వ్యవహారంపై ఎవరైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని వివరించారు. గోరంతను కొండంతలుగా ప్రచారం చేయవద్దని మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. రాష్ట్రంలో మరో పది సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉండేలా ఐక్యంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. జగిత్యాలలో అతిత్వరలో అందరం కలిసి ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తామన్నారు. జగిత్యాల కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న సమస్య సాధ్యమైనంత తొందరలో పరిష్కరింపజేయడానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు.